# ఆధునిక నీతి కథలు



## వాళ్లూరు నాగేశ్వరరావు

పరుగెత్తి నీరు తాగేకంటే నిలబడి నింపాదిగా నీరు తాగడం మంచిదని జీవితంలో అక్షరశః నమ్మే వ్యక్తి విశ్వేశ్వరావు. స్వశక్తితో, ఆర్థికబలంలేని వెన్నముకతో, ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రానికి తగిన అలవాట్లతో, నడతలో, ఉద్యోగ నిర్వహణలో 'నీతి-నిజాయితీకి' అత్యధిక ప్రాముఖ్యమిస్తూ, ఎం. ఏ దాకా చదివి, ఆపైన ఐ. ఎ. ఎస్‌లో మంచి రాంక్ తెచ్చుకొని, ట్రైయినింగ్ అయి, ఆరేళ్లపాటు ఆరు జిల్లాల్లో పెద్ద ఉద్యోగాలు చేసి, ఆ తర్వాత రాజధాని నగరానికి ఒక ప్రభుత్వ కంపెనీకి మేనేజింగ్ డైరక్టరుగా బదిలీ అయి వచ్చాడు. అతనికి ఎర్రత్రికోణంలాగా ముగ్గురు పిల్లలు. ఇద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. హైదరాబాద్ స్కూళ్లలో పిల్లలకు ప్రవేశం లభించడం నిలువుకాళ్లతో ఏడు కొండలు ఎక్కినంత ప్రయాసతో కూడుకున్న విషయమని విశ్వేశ్వర్రావుకు ఆచరణలో గానీ తెలిసిరాలేదు. పెద్దబ్బాయిని నాలుగో క్లాసులో చేర్పించడానికి, చిన్నబ్బాయిని రెండో క్లాసులో చేర్పించడానికి, అమ్మాయిని అప్పర్ కేజిలో చేర్పించడానికి అతను మూడువారాల పాటు ఎన్నో తిప్పలు పడ్డాడు.

కొన్ని స్కూళ్లలో వందలకొద్దీ డొనేషన్లు అడిగారు; మరికొన్నింటిలో ఖాళీలు లేవని మొహాన ఎర్రనీరుకొట్టినట్టు నిర్మొహమాటంగా చెప్పారు. ఇంకొన్నింటిలో భవనంఫీజు కింద ప్రత్యేకంగా చెల్లించాలన్నారు. ఆరేళ్ల సర్వీసులో అర పైసా లంచంగానీ, ఇతర్ల దగ్గర అరకప్పు కాఫీగానీ పుచ్చుకోని విశ్వేశ్వర్రావుకు వొంటికి కిలో కొత్తకారం రాసుకున్నంత చిరాకు కలిగింది. పిల్లలకు స్కూళ్లలో అడ్మిషన్ దొరక్కపోతేమానె, తాను నత్తపైసాకూడా ఎక్కువ చెల్లించనని భీష్మించుకొని కూర్చున్నాడు. అతని భార్య జోరున భోరుమంది. అయినా అతను లక్ష్యపెట్టలేదు. కనీసం తాను ఐ. ఎ. ఎస్ ఆఫీసర్ననీ, ఫలానా రాష్ట్ర ప్రభుత్వ సంస్థకు మేనేజింగ్ డైరక్టరుననీ — ఏ స్కూలు హెడ్మాస్టరుతోనూ, ప్రిన్సిపాల్‌తోనూ చెప్పుకోలేదు. తన హోదాను చాటుకొని, పరులను భయపెట్టి, సీట్లు సంపాయించడం వ్యక్తిత్వానికి భిన్నమని అతని అభిప్రాయం.

పెదవది స్కూళ్ళల్లో సీట్లు సంపాయించడానికి అయ్యగారు పడే బాధలన్నీ ప్యూన్ దానయ్య ప్రత్యక్షంగా చూసి, ఒక రోజు సాయంకాలం విశ్వేశ్వరావుతో సవినయంగా మనవిచేశాడు.

"అయ్యగారు! మరోలా అనుకోనేపోతే ఓ మంచి స్కూల్లో పిల్లలకు నేను సీట్లు యిప్పించే ఏర్పాటు చేస్తాను."

విశ్వేశ్వర్రావు విస్మయంతో విభూతిలా మొహం వేసుకొని, "నిజమా" అన్నాడు.

"రేపు చూడండి సాబ్" అన్నాడు దానయ్య ధీమాగా.

తల ఆడించాడు విశ్వేశ్వర్రావు, పీడిమొహం అనుకుంటూ.

ఆ మరునాడు పదకొండు గంటలకల్లా ఒక మిషనరీ స్కూల్లో ఇద్దరు మగపిల్లలకూ, మరో మంచి కాన్వెంట్‌లో ఆడపిల్లకూ అడ్మిషన్ సంపాయించి, అమ్మగార్ని అడిగి డబ్బు తీసుకొని, ఫీజులు కట్టి, ఆ రసీదుల్ని విశ్వేశ్వర్రావుకు చూపెట్టాడు దానయ్య ఐ.ఎ.ఎస్ ఆఫీసరు కంటె తనకే సిటీలో అధికంగా ఇన్‌ఫ్లుయన్సు ఉన్నదన్న ఉత్సాహంతో.

విశ్వేశ్వర్రావు విపరీతంగా ఆశ్చర్యపోయి ఓ గ్లాసు మంచినీళ్లు తాగాడు-ఆశ్చర్యాన్నుంచి తేరుకోవడానికి. అయినా నోరు తెర్చి దానయ్య చేసిన ఘన కార్యాన్ని శ్లాఘించలేదు. తల ఆడించి వూరుకున్నాడు. అయ్యగారికి ఆలవిగాని పనిని తాను అరపూటలో చేశానన్న సంబరంతో ఆ సాయంత్రం దానయ్య రెండు సీసాల బీరు తాగాడు, కోడికూర నంజుకొంటూ.

ఆ మరునాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు ద్వారా దానయ్యను గురించి వాకబు చేశాడు.

"వాడు అఖండుడండీ! లాస్ట్ ఇయర్ మెడిసిన్‌లో కూడా ఎం.డి.గారి అమ్మాయికి సీటు తెప్పించి పెట్టాడు. వాడు అయిదో క్లాసు చదువుకున్నా, వాడికున్న పలుకుబడి ఐ.ఎ.ఎస్ ఆఫీసరు క్కూడా లేదు" అన్నాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చిరునవ్వును దొర్లిస్తూ.

విశ్వేశ్వర్రావు కనుబొమలు దగ్గరకు చేర్చి అయిదు నిముషాల పాటు అదేపనిగా ఆలోచించాడు ఫైళ్లకేసి కూడా చూడకుండా.

ఆ రోజు సాయంకాలం ఇంటికి రాగానే దానయ్యను మెచ్చుకుంటూ భార్యామణి దండకం చదివింది. విశ్వేశ్వర్రావు మొహం మంగళంలో ఉప్పు గల్లు అయింది.

ఆ తర్వాత నాలుగు రోజులకు దానయ్యను ఆ ఆఫీసునుంచి బదిలీ చేయించాడు విశ్వేశ్వరావు తన పలుకుబడికి ప్రతిఫలం ఇదా అన్నట్టు దానయ్య లబోదిబో అంటూ విశ్వేశ్వరావు దగ్గరకొచ్చాడు.

"నీలాంటివాడికి ఇది తగిన ఆఫీసు కాదు దానయ్యా!" అన్నాడు విశ్వేశ్వరావు ఫైలులోంచి మొహం పైకెత్తకుండానే.

ఆ మాటల్లోని అంతరార్థం దానయ్యకు అరగంట ఆలోచించినా అంతు బట్టలేదు.

*నిలబడి నీరుతాగేవాళ్ల నైజాన్ని పరుగెత్తి నీరు తాగేవాళ్లు పసిగట్టటం బహుకష్టం.*

---

ఆగష్టు నెల భావపరిచయ పోటీ

**బహుమతి పొందిన వ్యాఖ్యలు**

''శత్రువులముందు శార్దూలం
కళత్రంముందు మార్జాలం''

—ఆర్. పట్టాభిరామరాజు.

''చిత్రంలో చిందించే రాజసం
కత్తిచూస్తే కారిపోయె నీరసం''

—శ్రీమతి కరుణాథామస్.

రు. 50 యిద్దరికీ సమానంగా పంచబడింది